క్లుప్తంగా

పరామర్శ



బచ్చన్నపేట: బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ బాలగోని పర్శరాములుగౌడ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, సర్పంచ్‌ను ఆదుకోండి కథనంతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి తోటి సర్పంచ్‌లు స్పందించి గురువారం హైదరాబాద్ వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, కొడవటూర్ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. సర్పంచ్‌లు వేముల వెంకట్‌గౌడ్, మూసిని సునీత, సుశీల, నాయకులు రాజుగౌడ్, వినయ్‌కుమార్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఎస్సైని కలిసిన గిరిజన నాయకులు



జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బి.శంకర్‌నాయక్‌ను మగ్దుంతండాకు చెందిన గిరిజన నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్‌నాయక్‌ను శాలువాతో సత్కరించారు. నాయకులు వాంకుడోత్ అశోక్‌నాయక్, బానోత్ దుర్గసింగ్ నాయక్, బానోత్ మోతిలాల్‌నాయక్, బానోత్ భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

మహానాడును జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 27, 28న ఏపీలోని రాజమండ్రిలో నిర్వహించనున్న మహానాడుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు బైరపాక ప్రభాకర్ పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల వారికి మహానాడు ఒక పండుగ అని, విశ్వ విఖ్యాత నటుడు ఎన్టీఆర్ 100వ పుట్టిన రోజు వేడుకలు దేశంలో పలు చోట్ల జరుగుతున్నాయన్నారు. దాంతో ఈ మహానాడుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కృష్ణారెడ్డి, మోహన్‌నాయక్, సిద్ది రాములు, కుమారస్వామి, హరీష్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చిల్పూరు: పల్లగుట్టకు చెందిన కాంగ్రెస్ మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు జీడి స్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర బాధితుడిని గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. పల్లగుట్ట గ్రామశాఖ అధ్యక్షుడు దార రాజు, జిల్లా కార్యదర్శి మర్రి దుర్గాప్రసాద్, ఇస్రం శ్రీనివాస్, బూనేటి రాజిరెడ్డి, సునీల్, జగన్, శ్రీను,ర రమేష్, రేణుక, లక్ష్మి, లలిత, శోభ, లచ్చమ్మతోపాటు తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి



పాలకుర్తి టౌన్: మండలంలోని గూడూరులో గురువారం తెల్లవారుజామున పిడుగుపాటుతో ఓ రైతుకు చెందిన దుక్కిటెద్దు మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రైతు కుంట చెన్నయ్యకు చెందిన దుక్కిటెద్దు పిడుగుపాటుతో మృత్యువాత పడింది. ఈ ఘటనతో తనకు రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరారు.

తమ్మడపల్లి(జి)లో ఆవు..



జఫర్‌గఢ్: పిడుగుపాటుకు ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని తమ్మడపల్లి (జి)లో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు ఎండి షర్ఫోద్దీన్ తన వ్యవసాయ బావి వద్ద ఉండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఇదే సమయంలో పిడుగు పడడంతో అక్కడే ఉన్న ఆవు మృతి చెందింది. రూ.50 వేల విలువ చేసే ఆవు పిడుగుపాటుకు మృతి చెందిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మట్టి అక్రమ తరలింపుపై పట్టింపేది?

తరలింపును అడ్డుకున్న యువత



మట్టి తవ్వకాన్ని అడ్డుకుంటున్న యువకులు

జనగామ రూరల్: చెక్ డ్యాంల అభివృద్ధి పనుల పేరిట అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై యథేచ్ఛగా మండలంలోని రామప్ప కుంటలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. గతంలో అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా పట్టించుకోలేదు. తహసీల్దార్, డీఈలు వచ్చి చూసి వెళ్లారే తప్ప చర్యలేమి తీసుకోలేదు. దీంతో మట్టి తరలింపు మాత్రం ఆగడం లేదు. చీటకోడూర్‌లో రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఫేస్–1,2 చెక్ డ్యాంల నిర్మాణం అసంపూర్తిగా, నాణ్యతా ప్రమాణాలు లేకుండా, ఇంజనీర్ అధికారుల పర్యవేక్షణ లేకుండా జరిగాయి. కట్టపై గ్రామంలోని రామప్పకుంట నుంచి సదరు కాంట్రాక్టర్ ఏకంగా పొక్లెయినర్‌తో టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. మట్టితో పనులు చేపట్టి అభివృద్ధి పనులు చేసినట్లు బిల్లులు తీసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అయితే గ్రామంలో చౌడు భూములు, చెరువులు, కుంట మట్టిని తరలిస్తే రైతులపై కేసులు పెడతామన్న అధికారులు కాంట్రాక్టర్‌కు ఎలా పర్మిషన్ ఇచ్చారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారి పాత్ర ఏమైనా ఉందా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత 15 రోజుల నుంచి మట్టి తరలిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గురువారం గ్రామంలోని యువత పనులను అడ్డుకున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్య తీసుకోని పక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని అన్నారు.



ట్రాక్టర్లలో తరలుతున్న మట్టి

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న భగత్‌రెడ్డి

బచ్చన్నపేట: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన రైతులకు ఇబ్బందులు కలిగించకూడదని ఎంఆర్‌ఐ భగత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బసిరెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చిన ధాన్యాన్ని తూర్పారాబట్టి తేమ శాతం రాగానే వెంటనే తూకం వేయాలన్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను ఏ రోజుకారోజున లారీల్లో మిల్లులకు తరలించాలని అన్నారు. ఏఆర్ఐ ఆంధ్రయ్య, ఎంసీ రవీందర్, కేంద్రం నిర్వాహకులు, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

పాలకుర్తి టౌన్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ నల్లా నాగిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత శ్రేణి అస్పత్రిలో జన ఆరోగ్య సమితి ఏర్పాటుకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తి ఉన్నత శ్రేణి అస్పత్రి అభివృద్ధికి జన ఆరోగ్య సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఉన్న 11 సబ్ సెంటర్ల స్థానంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఒక్కో వెల్‌నెస్ సెంటర్‌లో ఒక డాక్టర్, ఇద్దరు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉంటారని తెలిపారు. ఇప్పటి వరకు ఐదు సెంటర్లలో వైద్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. అన్ని సెంటర్లలో మౌలిక సదుపాయలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. డాక్టర్ జ్యోతి, తహసీల్దార్ పాల్‌సింగ్, ఎంపీడీఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎంపీపీ సావిత్రి

దేవరుప్పుల: గడపగడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషమ్ అన్నారు. గురువారం మండలంలోని ధర్మగడ్డ తండాలో లబ్ధిదారుల ఇంటిముంగిట కల్యాణలక్ష్మి చెక్కును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయాలకీతతంగా ప్రభుత్వం ఇంటింటా అర్హులకు అందించే ఆసరా పింఛన్, వ్యవసాయ రైతులకు రైతు బంధు, బీమా పథకం వంటి చారిత్రాత్మక పథకాలు జీవనోపాధికి దోహదపడుతాయని పేర్కొన్నారు. సర్పంచ్ గుగులోత్ సునీత ఆంజనేయులు, నల్ల యాదగిరి, మూడ సైదులు, మాజీ సర్పంచ్ అరుణ పాల్గొన్నారు.

ధాన్యం రవాణాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

జనగామ రూరల్: ధాన్యం రవాణాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ మేకల కళింగ రాజు తెలిపారు. గురువారం మండలంలోని పసరమడ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. లారీల కొరత ఉందని రైతులు తెలుపడంతో సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం చివరి గింజవరకు కొనుగోలు చేస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నామని తెలిపారు.

ముగిసిన బీరప్ప ఉత్సవాలు



బీరప్ప ఉత్సవాల్లో సర్పంచ్, వైస్ ఎంపీపీ

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురంలో జరుగుతున్న శ్రీబీరప్ప, కామరాతి ఉత్సవాలు గురువారంతో ముగిసినట్లు ఒగ్గు బీర్ల పూజార్లు తెలిపారు. చివరి రోజు బయ్యన్నపూజ నిర్వహించారు. బీర్ల వారు దేవతల చరిత్రలను ఒగ్గు కథా రూపంలో చెప్పగా వందలాది మంది తిలకించారు. పండుగ సందర్భంగా ప్రతి ఇల్లు బంధువులతో నిండిపోయి సందడి నెలకొంది. గ్రామ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, కుల పెద్దలు వస్పరి నర్సింహులు, పరిదె కొమురయ్య, సత్తయ్య, మల్లయ్య, సిద్దులు, ధర్మేందర్, సాయి మల్లయ్య, బాలయ్య, రాములు, కిష్టయ్య, భీమేష్, బుచ్చి మల్లయ్య, శ్రీనివాస్, ఒగ్గు, బీర్ల పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..



పరామర్శిస్తున్న కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: గుండెపోటుతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎండి అబ్దుల్‌సలాం, అనారోగ్యంతో మృతి చెందిన బదావత్ చిలుకమ్మ కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పేర్కొన్నారు. జఫర్‌గఢ్‌కు చెందిన ఎండి అబ్దుల్‌సలాం గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న శ్రీహరి గురువారం గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రేగడితండా గ్రామానికి చెందిన బదావత్ చిలుకమ్మ కుటుంబాన్ని కూడా కడియం శ్రీహరి పరామర్శించారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, నాయకులు రాజేష్‌నాయక్, మోహన్‌రావు, సర్పంచ్‌లు సంపత్‌రెడ్డి, సువర్ణ అయోధ్య, పార్వతి రవి, ఎంపీటీసీ సభ్యులు దేవేందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

అబ్దుల్ సలాం మృతి పార్టీకి తీరని లోటు

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి అబ్దుల్‌సలాం అకస్మిక మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. అబ్దుల్‌సలాం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య గురువారం పార్టీ బృందంతో కలిసి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి రజిత యాకయ్య, ఉన్నారు.

పల్లెల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



రఘునాథపల్లి: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

రఘునాథపల్లి: పల్లెల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గురువారం మండలంలోని శివాజీనగర్, కంచనపల్లి, కోడూర్‌లో ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో సర్పంచ్‌లు శివరాత్రి కొమురయ్య, గవ్వాని విజయనాగేశ్వర్, కర్ణాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పల్లె ప్రగతి కార్య క్రమాల ద్వారా గ్రామాల రూపురేఖలు మార్చిందన్నారు. అన్ని వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. గృహలక్ష్మి పథకంలో ఇంటి స్థలం ఉన్న పేదలకు నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, మాజీ వైస్ చైర్మన్ నామాల బుచ్చయ్య, ఎంపీటీసీలు కేమిడి రమ్య రాజు, బొల్లపల్లి సరోజన, గూడెల్లి శిరీషసురేష్, గొరిగె రవి, తిప్పారపు రమ్యబాబురావు, మమత, రాజు, నానాజీ, ప్రభాకర్, హరినాథ్, జోసఫ్, రాములు, హరిష్‌గౌడ్, బిర్రు మధు పాల్గొన్నారు.


దుర్గామాతకు పూజలు

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేటలో జరిగిన దుర్గమ్మ పండుగ వేడుకల్లో గురువారం ఎమ్మెల్యే రాజయ్య పాల్గొని దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని దుర్గామాతను వేడుకున్నారు. ఎంపీపీ జయశ్రీ, జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, సర్పంచ్ జయరాజేశ్వర్, ఎంపీటీసీ సిద్దు, రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లింగాలఘణపురం: రాత్రి వేళల్లో ఆరుబయట నిద్రించే మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భువనగిరి ప్రాంతంలో మహిళల మెడలో నుంచి చైన్ స్నాచింగ్ చేసే దొంగలముఠా తిరుగుతున్నట్లు సమాచారం ఉందని, ఆ ముఠా లింగాలఘణపురం మండలంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా గ్రామాల్లో కనిపిస్తే 8712685 212 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రైలు ఢీకొని బాలుడి మృతి



సాత్విక్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని రైల్వేగేటు వద్ద ట్రాక్ దాటుతున్న పెరబోయిన సాత్విక్(13) అనే బాలుడిని ప్రమాదవశాత్తు గుర్తు తెలియని ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శివునిపల్లికి చెందిన పెరబోయిన సంధ్య, శేఖర్‌లకు ముగ్గురు సంతానం. కాగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. వారు స్థానిక రైల్వేగేటు సమీపాన చిన్న డబ్బా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రైల్వేగేటు వద్ద ఉన్న డబ్బా వద్దకు వచ్చిన వారి కుమారుడు సాత్విక్ తిరిగి శివునిపల్లికి వెళ్లే క్రమంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రమాదం రాత్రి 7.30 గంటలకు జరుగగా అర్ధరాత్రి వరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి రాకపోవడంతో రైల్వే పట్టాలపై మృతుడి కుటుంబ సభ్యులు శవ జాగారం చేయాల్సి వచ్చింది.

చిన్నపెండ్యాలలో దొంగల బీభత్సం

● నిద్రిస్తున్న మహిళల మెడలలో నుంచి బంగారు గొలుసుల అపహరణ

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. నిద్రిస్తున్న మహిళల మెడలో నుంచి ఏడుతులాల బంగారు గొలుసులను లాక్కెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నపెండ్యాల గ్రామ శివారులో గేమ్యాతండాలో ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న భూక్య దేవమ్మ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు (గోపితాడు)ను దొంగలు లాక్కెళ్లారు. అదేవిధంగా చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన మాచర్ల మాధవి తన తల్లిగారి ఇంట్లో ఉక్కపోతను భరించలేక తలుపులు తీసి మంచంపై నిద్రిస్తోంది. తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడిన దొంగలు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. రాత్రికి రాత్రే నిద్రిస్తున్న మహిళల మెడల్లో నుంచి బంగారు గొలుసులు అపహరించుకు పోవడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

గో సంరక్షణకు పాటుపడాలి



లేగదూడల పంపిణీలో మహేష్‌అగర్వాల్

స్టేషన్‌ఘన్‌పూర్: గోసంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో పది మంది రైతులకు గురువారం గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా లేగ దూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గో ఆధారిత వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గో ఆధారిత వ్యవసాయం చేయాలని, గోవుల సంరక్షణకు పాటుపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల పరశురాములు, శివలింగం గోశాల అధ్యక్షుడు పి.యాకయ్య, కార్యదర్శి ఎం.కరణ్, సభ్యులు రమేష్, సూపరింటెంట్ దుర్గం రోజా తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న బేజాడి బీరప్ప

బచ్చన్నపేట: అకాల వర్షం, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వడగళ్ల వర్షం కురిసి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు పరిహారం ఏ ఒక్క రైతుకు అందలేదన్నారు. అన్నదాతలు మళ్లీ సేద్యం ప్రారంభించే సమయం ఆసన్నమైందని, మూడు రోజుల్లో పంట నష్ట పరిహారం రైతుల ఖాతాల్లో జమ కాకుంటే అన్నదాతలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీజేవైఎం జనగామ అసెంబ్లీ కన్వీనర్ నవీన్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అఫ్జల్, మండల అధ్యక్షుడు బంగారు మహేష్, నాయకులు పెండెం నాగేష్, కూర్పెల్ల వెంకట్‌రెడ్డి, గద్ద రాజు, దుగ్యాని తిరుపతి, మిన్నాలపురం జలేందర్, రాకేష్ పలువురు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై భయం వీడాలి



మాట్లాడుతున్న ఎంఈఓ భగవాన్

జనగామ రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల భాషపై భయాన్ని వీడి ఆసక్తిని చూపాలని ఎంఈఓ భగవాన్ అన్నారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్, పూలే అధ్యయన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులను ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. ఇంగ్లిష్‌లో పట్టు సాధిస్తే ఉన్నత చదువులకు ఉపయోగపడుతుందని అన్నారు. వేసవి సెలవుల్లో ఇలాంటి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, ఆగయ్య, కృష్ణమూర్తి, నాగరాజు ఉన్నారు.

ఎంసెట్‌లో ఏబీవీ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

జనగామ రూరల్: జనగామలోని ఏబీవీ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ కనకరాజు తెలిపారు. గురువారం విడుదలైన ఎంసెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో బడికె సాకేత్‌కుమార్ 3,337 ర్యాంకు , అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో బాసుల బెల్హా 1,993వ ర్యాంకును కైవసం చేసుకుందని అన్నారు. అలాగే పది వేల లోపు ర్యాంకులు 8మంది సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధ్యాపక బృందం అభినందించింది.